సర్వీసు రోడ్డులో ప్రయాణం ప్రాణాంతకం

- రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాల గుట్టలు
- ప్రమాదాలకు నెలవుగా మారిన సర్వీసు రోడ్లు
- పట్టించుకోని అధికారులు



కంకిపాడు సర్వీసురోడ్డులో భవన నిర్మాణ వ్యర్థాలు



పునాదిపాడు వద్ద రోడ్డు మార్జిన్‌లో పేరుకుపోయిన తాటి వ్యర్థాలు

కంకిపాడు: సర్వీసు రోడ్డులో ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు పడేయటంతో ప్రయాణం ప్రమాదకరంగా తయారైంది. ఏ మాత్రం ఆదమరిచినా వాహనం అదుపు తప్పి ప్రమాదం సంభవిస్తుందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

దుర్వాసన భరించలేకపోతున్న ప్రయాణికులు

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి అభివృద్ధి, విస్తరణ పనుల్లో భాగంగా కంకిపాడు వద్ద బైపాస్ మార్గాన్ని నిర్మించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని రహదారుల గుండా ప్రధాన రహదారి చేరుకునేందుకు అనువుగా సర్వీసు రోడ్డు మార్గాలను అందుబాటులోకి తెచ్చారు. జాతీయ రహదారికి అనుబంధంగా ఉన్న సర్వీసు రోడ్లలో వ్యర్థాల గుట్టలు పేరుకుపోతున్నాయి. కంకిపాడు, పెనమలూరు మండలాల్లోని పలువురు దుకాణదారులు, చిరు వ్యాపారులు వ్యర్థాలను తీసుకొచ్చి సర్వీసు రోడ్డు మార్జిన్‌లో గుట్టలు పోస్తున్నారు. దారి పొడవునా వ్యర్థాల గుట్టలతో మార్జిన్‌లు నిండిపోతున్నాయి. కొందరు భవన నిర్మాణ వ్యర్థాలను సైతం తీసుకొచ్చి మార్జిన్‌లలో పడేస్తున్నారు. మాంసం వ్యర్థాలు పేరుకుపోయి, వ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. ప్రయాణ సమయంలో దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సిందే.

ఆదమరిస్తే ప్రమాదమే

బైపాస్‌తో పాటుగా ప్రధాన రహదారి మార్జిన్‌ల లోనూ వ్యర్థాలు ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం అధికంగా ఉంది. సర్వీసు రోడ్డు మార్గంలో కనీసం వీధి దీపాలు కూడా లేని పరిస్థితి ఉంది. దీంతో ఆయా మార్గాల్లో మార్జిన్‌లలో గుట్టలు కనపడక ద్విచక్ర, త్రిచక్ర వాహనదారులు వ్యర్థాలను ఢీకొనటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీసు రోడ్లు అధ్వానంగా ఉన్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకోవటం లేదు. ఫలితంగా మార్జిన్‌లు అస్తవ్యస్తంగా తయారై రాకపోకల సమయంలో వాహనదారులకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి.

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం



కానూరులో సీమంతాలు చేస్తున్న అధికారులు



యనమలకుదురులో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న సర్పంచి కె.సరళ, ఐసీడీఎస్ అధికారి కవిత



రామవరప్పాడులో సామూహిక సీమంతాలు

సీడీపీవో బేబీసుకన్య

పెనమలూరు: తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతుందని, రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయని సీడీపీవో బేబీసుకన్య అన్నారు. కానూరు గ్రామంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులు, బిడ్డలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. తల్లులు బిడ్డలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యనమలకుదురులో...

యనమలకుదురు సెక్టార్‌లో పౌష్టికాహార పక్షోత్సవాలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కల్యాణి వర్మ మాట్లాడుతూ పోషక్ ట్రాకర్‌లో లబ్ధిదారులు స్వయంగా వారి పేర్లు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచి షేక్.కాశిం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, తుల్లులు పాల్గొన్నారు.

పెనమలూరులో...

పెనమలూరు సెక్టార్‌లో పల్లిపేటలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీలత తక్కువ ఖర్చుతో పోషకాహారం ఎలా తయారు చేసుకోవాలో తల్లులకు శిక్షణ ఇచ్చారు. అనారోగ్యంగా, ఎదుగుదల లేని చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందించాలని సూచించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు, తుల్లులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

రామవరప్పాడు: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో మంగమ్మ అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ప్రసాదంపాడు గ్రామంలో సర్పంచ్ సర్నాల గంగారత్నం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగమ్మ మాట్లాడుతూ తృణ ధాన్యాలు, గుడ్లు, ఆకుకూరలు వంటి పౌష్టికాహార పదార్థాలు నిత్యం ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

నున్నలో...

నున్న(విజయవాడరూరల్): గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వాలని నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ సూచించారు. నున్న గ్రామ సచివాలయం 2 లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా 20 మంది గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమం జరిగింది. సర్పంచి సరళ గర్భిణులకు చీరలు, గాజులు, పువ్వులు, పసుపు, కుంకుమ, చలివిడి, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి సరళ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని, తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, బిడ్డకు జన్మనిచ్చిన పిమ్మట కూడా వెయ్యి రోజులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ గర్భిణులు స్థూలకాయం రాకుండా జీవనశైలి విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఎంఎస్‌కేలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరంలో...

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలోని హెల్త్ సబ్ సెంటర్‌లో బుధవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగపద్మావతి మాట్లాడుతూ గర్భస్థ దశ నుంచి రెండేళ్ల పాటు మహిళలు మంచి ఆహార, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బెల్లం చిక్కీలు, బెల్లం నువ్వులు, మునగ ఆకు, ఆకుకూరలు తినడం వల్ల ఐరన్, ఎక్కువ పోషకాలు లభిస్తాయని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్.పెర్సి, బి.అరుణ, ఐ.మీనాకుమారి, భవాని తదితరులు పాల్గొన్నారు. తొలుత ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మీ రహదారులకు మీరే రక్షణ

- పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్
- సాయిపురంలో 3.50 కోట్లతో సీసీ రోడ్లు ప్రారంభం



సీసీ రోడ్ల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరురూరల్: వేల కోట్ల రూపాయలతో నిర్మించిన రహదారులు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని సాయిపురం గ్రామంలో మూడున్నర కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక్క రహదారిని కూడా నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. సాయిపురం గ్రామాన్ని అన్నింటా అభివృద్ధిపరిచేందుకు మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన..

గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చావలి సీతారామాంజనేయులు(బాబు) సుమారు నాలుగు సెంట్లు స్థలాన్ని పంచాయతీ భవన నిర్మాణానికి విరాళంగా అందజేశారు. దీంతో మండల పరిషత్ వార్షిక ఆదాయ నిధులు రూ.10 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. పంచాయతీ సర్పంచ్ షేక్ జాన్ పాషా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ స్థలదాతను ఘనంగా సన్మానించారు.

ఎంపీటీసీకి దక్కని చోటు...

గ్రామంలో బుధవారం జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, నూతన పంచాయతీ భవన శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన బోళ్లపాడు- సాయిపురం ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ)కి అవమానం ఎదురయింది. స్థానిక ఎమ్మెల్యేతో పాటు అధికార కూటమికి చెందిన నాయకులను వేదిక పైకి ఆహ్వానించిన ఎంపీడీవో శేషగిరిరావు స్థానిక ఎంపీటీసీని మాత్రం వేదిక పైకి పిలవలేదు. కార్యక్రమంలో ఎంపీపీ చీలి కల్పన, వైస్ ఎంపీపీ గంజి స్వర్ణలత, ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), ఆర్ అండ్ బీ డీఈ బలరాం, పీఆర్ డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగ విరమణ 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గతంలో కార్మికులు చేసిన సమ్మెకు సంబంధించి జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు.పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, కార్మికులకు ఇవ్వాల్సిన దుస్తులు, సబ్బులు, చెప్పులు, పనిముట్లు వెంటనే అందజేయాలన్నారు. కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సమ్మె బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వై.సరళ, మధిర ఏడుకొండలు, చొప్పవరపు రత్నకర్ణ, కె.డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరాటం

సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



పెనమలూరు: ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. గోసాలలో బుధవారం వైఎస్సార్ సీపీ పెనమలూరు మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని బలోపేతం చేయటానికి మండల, గ్రామ పార్టీ, అనుబంధ కమిటీల నియామకం చేస్తామని చెప్పారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. పార్టీ శ్రేణులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. సమావేశంలో జిల్లా, మండల పార్టీ నేతలు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, మాదు శ్రీహరిరాణి, మండూరు కోటేశ్వరరావు, సర్పంచి సంగెపు శ్రీనివాసరావు, పోలవరపు రవి, అబ్దుల్ గని, మాదు విజయ్‌కుమార్, చుండూరు శేఖర్‌బాబు, ఆరు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంకిపాడులో చిల్లర దొంగతనాలు

ప్రధాన సెంటరులో దుకాణాలు పగలకొట్టిన చోరులు

కంకిపాడు: కంకిపాడు పట్టణంలో చోటుచేసుకున్న చిల్లర దొంగతనాలకు పట్టణ వాసులు హడలెత్తిపోతున్నారు. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ చోరీలు జరగటం చర్చనీయాంశం అయింది. వివరాల్లోకి వెళితే...పట్టణంలోని బస్టాండు కూడలిలోని ప్రధాన సెంటరులో బుధవారం తెల్లవారుజామున రెండు దుకాణాల తాళాలు పగలకొట్టి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఓ దుకాణంలో రూ.10 వేలకు పైగా విలువైన సిగరెట్లు, కొంత నగదు అపహరించుకుపోయినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. అలాంటి ప్రదేశంలోనే దొంగలు రెక్కీ వేసి దుకాణాల తాళాలు పగలకొట్టి చోరీకి తెగబడ్డారు.ఈ విషయమై ఎస్ఐ డి.సందీప్‌ను 'సాక్షి' వివరణ కోరగా, చోరీ జరిగిన మాట వాస్తవమేనని, ఫిర్యాదు అందలేదన్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, త్వరలోనే చోరీకి పాల్పడ్డ వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకుంటామని వివరించారు.

19 నుంచి మహా సంప్రోక్షణ పూర్వక కుంభాభిషేకం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని గీతామందిరంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు మహాసంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు గీతా మందిర భక్త బృందం కమిటీ సభ్యులు తెలిపారు. గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహం ప్రతిష్టించి పుష్కరకాలం పూర్తయినందున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రతువును హనుమాన్ చాలీసా పారాయణంతో కమిటీ సభ్యులు బుధవారం ప్రారంభించారు.

నేషనల్ పేపర్ ప్రెజెంటేషన్‌లో దంత విద్యార్థుల ప్రతిభ



చిన్నఅవుటపల్లి(గన్నవరం): జాతీయ స్థాయిలో జరిగిన పేపర్ ప్రెజెంటేషన్ పోటీలో చిన్నఅవుటపల్లిలోని డాక్టర్ సుధా, నాగేశ్వరరావు సిద్దార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ కళాశాల విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగ్రాలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు 25వ ఐఏసీడీఈ నేషనల్ పీజీ కన్వెన్షన్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. పేపర్ ప్రెజెంటేషన్ కేటగిరిలో తమ కళాశాల విద్యార్థినులు డాక్టర్ వై.ఇందుమతి ప్రథమ స్థానం, డాక్టర్ పూజిత మహదేవ్ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థినులను కళాశాల కన్వీనర్ పాలడుగు సాయి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై.మధుసూదనరావు, హెచ్ఓడీ డాక్టర్ రాంబాబు అభినందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో 35 మందికి ఉద్యోగావకాశాలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బుధవారం ఇంజినీరింగ్, డిప్లమో విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 35 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థులు 24 మంది, డిప్లొమో విద్యార్థులు 11 మంది ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందించి గుర్తింపు పొందాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్‌గా పనిచేసి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన డాక్టర్ సంజయ్ మంత్రను లయన్స్ క్లబ్ ప్రతినిధులు, పట్టణ ప్రజలు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వి.శివరామకృష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

• సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా దుర్గాదేవి



కంకిపాడు: కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎల్.దుర్గాదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ సంజయ్ ఇటీవల ఉద్యోగోన్నతిపై గుంటూరు జీజీహెచ్‌కి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బదిలీ అయ్యారు.

• పోరంకిలో చలివేంద్రం ప్రారంభం

పెనమలూరు: పోరంకిలో శివసతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం మాజీ ఎంపీపీ బొర్రా కనకదుర్గ ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బొర్రా కృష్ణ, బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• గొల్లనపల్లిలో చలివేంద్రం

గొల్లనపల్లి(గన్నవరం): మండలంలోని గొల్లనపల్లిలో మెయిన్ రోడ్డు పక్కన క్రీస్తు రక్షణ సంఘం ఆధ్వర్యంలో పాస్టర్ ఐజాక్ ఏర్పాటుచేసిన వేసవి చలివేంద్రంను బుధవారం గ్రామ ప్రముఖుడు గణపవరపు వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

• ఘనంగా కందుకూరి జయంతి వేడుకలు

ఉయ్యూరురూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరిరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిషత్, ఉపాధి హామీ పథకం, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

• ప్రాంగణ ఎంపికల్లో 33 మంది ఎంపిక

ఉయ్యూరు: స్థానిక ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఉపాధి శిక్షణ విభాగం ఆధ్వర్యంలో దివీస్ లేబొరేటరీస్ ప్రతినిధులు 47 మంది విద్యార్థులను ఇంటర్వ్యూలు చేశారు. వారిలో 33 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో 21 మంది పీజీ, 12 మంది డిగ్రీ విద్యార్థులు ఉన్నారు.

• ఏఐ ఇండస్ట్రీకి మంచి భవిష్యత్

నున్న(విజయవాడరూరల్): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండస్ట్రీకి మంచి భవిష్యత్ ఉంటుందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ముంబై) ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. నున్న గ్రామంలో వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజులుగా జరుగుతున్న ఎన్‌సి శక్తి-2025 జాతీయ సదస్సు బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏఐ ఇండస్ట్రీ 5.0 లో అమలు పరిచే విధానాలను విద్యార్థులకు వివరించారు. కన్వీనర్ డాక్టర్ జె. పవన్ సాయి మాట్లాడుతూ విదేశాలలో పరిశ్రమలు, కళాశాలల నుంచి పరిశోధనా పత్రాలను సమర్పించిన 110 మంది నిపుణులను అభినందించారు. ప్రిన్సిపాల్ బీవీ పరమేశ్వరరావు మాట్లాడుతూ నూతన సాంకేతిక ఆవిష్కరణలు విద్యార్థులు, అధ్యాపకులకు నూతనోత్సాహాన్ని కలిగించాయన్నారు. కార్యక్రమంలో చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, డైరెక్టర్ ఎన్.కీర్తిరెడ్డి పాల్గొన్నారు.

• ఎస్సీ రుణాలకు దరఖాస్తు చేయండి

పెనమలూరు: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేయాలని ఎంపీడీవో బండి ప్రణవి అన్నారు. లబ్ధిదారుడికి 21 -50 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, తెలుపు రంగు రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని చెప్పారు. ప్రతి యూనిట్‌కు బ్యాంకు రుణంతో పాటు సబ్సిడీ ఉంటుందని అన్నారు. వ్యవసాయ రంగం రుణాలకు ఐదుగురు సభ్యులతో ఉంటే రుణం రూ.10 లక్షలు ఇస్తారని, 80 శాతం రాయితీ ఉంటుందని, డ్రోన్‌లు మంజూరు చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో కాని, ఆయా సచివాలయాలలో కాని సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

• దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

పెనమలూరు: నియోజకవర్గంలో బుధవారం దివ్యాంగులకు ఉపకరణాలను ఎమ్మెల్యే బోడెప్రసాద్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉపకరణాలను పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో డీవైఈవో పద్మారాణి, సర్పంచి లింగాల భాస్కరరావు, ఎంపీడీవోలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మి, కంకిపాడు ఎంఈవో కేఎస్‌వీ ప్రసాద్, హెచ్‌ఎం.వై.దుర్గాభవాని, సమగ్ర శిక్ష అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

• పోషణ ట్రాకర్ సద్వినియోగం చేసుకోండి

ఉయ్యూరురూరల్: అంగన్వాడీ లబ్ధిదారులు పోషణ ట్రాకర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని బోళ్లపాడు వెల్నెస్ సెంటర్ సీహెచ్ఓ శివ కోరారు. మండలంలోని బోళ్లపాడులో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా తల్లులకు అంగన్వాడీ కేంద్రం నుంచి అందిస్తున్న సేవలపై అవగాహన కార్యక్రమం జరిగింది.

• అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక విజయవాడ రోడ్డులోని పలు అపార్టుమెంట్లలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అపార్టుమెంట్‌లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యల గూర్చి హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు వివరించారు.

